# మినీకథలు

## సిగరెట్

చుట్టూ దట్టంగా చీకటి. భూమ్యాకాశాలను కలిపేస్తో ఒకటే వర్షం. వుండుండి మెరుపులు కొండలపై జిగేల్ మని మెరిసి మాయమై పోతున్నాయి. వెంటనే పెద్ద శబ్దంతో వురుములు. రగ్గు మరింత దగ్గరకు లాక్కొని అలాగే చూస్తున్నాను. గాలి తెరతోపాటు అప్పుడొకసారి, అప్పుడొకసారి జల్లు తగులుతోంది. వొళ్ళు అప్పటికే కొంత తడిసి వుందేమో సన్నగా వొణుకు ప్రారంభమైంది. సిగరెట్ కావాలి. ఒక్కసారి గుండెనిండా ఆ పొగాకు పొగ పీలిస్తే ఎంత వెచ్చనో?— ఆలోచన్లు మరల్చాను. ఇలాంటి వానలో-ఈ రాత్రిలో కృష్ణశాస్త్రి అయితే— ఊఁ....హూ!

సంజీవదేవ్— "దబదబ వర్షం—గబగబ వర్షం"

ఉరుముల వర్షం
మెరుపుల వర్షం"

అంటో కవిత వ్రాస్తూ వుండేవాడా? కాదు. ఒక కిటికీ తెరిచి సన్నగా ఈలపాట పాడుకుంటూ వుండేవాడు.

చెలం— "ఈ రాత్రి ఇట్లో ఒంటరిగా ఆలోచిస్తూ కూర్చున్నాను. నీవు ఎలాగైనా వొస్తావని నా ఆశ. కానీ రావు. వొస్తేనా, నీ కళ్ళలోకి అలాగే చూస్తూ ఈ వర్షాన్ని, రాత్రిని అనుభవిస్తావా?". అంటాడు. కానీ, ఆ-? అ- వొస్తే? నేనీ రాత్రిని, వర్షాన్ని చూడకుండా వుంటానా? ఎన్నటికీ కాదు ఆమెతో కలిసి ఇలాగే ఝల్లులో తడుస్తూ.... అబ్బ! సిగరెట్.... సిగరెట్ కావాలి. అదే నెల్లూరులో అయితే ఎన్ని తాగి వురెదే వాడినో? సీమా "టీ" కూడా- బలవంతంగా



ఆలోచన్లు మరలుస్తున్నాను. విస్కీ కొంచెం వెచ్చగా గొంతులోకి దిగితే....? పేదలు, నిర్భాగ్యులు గుర్తుకు వస్తారేమో శ్రీశ్రీకి? ఇల్లు లేని వాళ్ళు ప్లాట్ ఫాంల మీద, కప్పులు లేని ఇళ్ళ క్రింద, కొమ్మలు లేని చెట్ల క్రింద- ముసలి, రోగి, పిల్లా, పడుచూ- కొమ్మలు లేని చెట్ల క్రింద మనుష్యుల సంగతి సరే- కొమ్మల మీది పిచ్చుకల సంగతి? పిట్టల సంగతి— లాభంలేదు ఇంక సిగరెట్ కావలసిందే. మంచి రచనొచ్చి వుందేది. కవితైనా- మరికొంత ఆలోచన జోడించి వ్రాసివుంటే ఏ పత్రికైనా దయతలచి ప్రచురిస్తే కీర్తీ- డబ్బూను— మరి సిగరెట్? ప్చ్! తిలక్ "అమృతం కురిసిన రాత్రి" ఏ అమృతం గురించి రాశాడో గాని ఈ వాన యిప్పుడు అమృతం ప్రపంచానికి. చెరువులు, బావులూ ఎండి పంటలు లేక రైతులెంత బాధపడుతున్నారో? రైతులేంటి? తాగటానికి నీళ్ళు? అది సరే.. ఇప్పుడు సిగరెట్లో? ఎదురుగా బల్లమీద కొంత, కొంత తడిసి చూస్తోవుంది. సన్నేనా? విసురుగా అందుకొని వానలో మంచి బలంగా విసిరేశాను ఆ ఖాళీ పాకెట్ ను.

—లక్ష్మి రమణ

## గ్లాసం

గుంటూరు స్టేషన్లో అడుగుపెట్టేసరికి మద్రాసు వెళ్ళే సర్కార్ ఎక్స్ప్రెస్ కూతవేసి కదిలింది. హడావుడిగా దొరికిన కంపార్టుమెంట్ ఎక్కేశాను రిజర్వేషను వుందికదా అన్న ధీమాతో. అత్తగారి వూరు మేడవారిపాలెం నుంచి ఆఖరి బస్సుకు బయలుదేరాను. అదికాస్తా ఆలస్యం కావటంతో స్టేషన్ కు రావడమూ ఆలస్యమైంది.

ఎలాగయితేనేం ఎక్కేశాంగదా అని ఆయాసం తీర్చుకుని పరిశీలనగా కంపార్టుమెంటును చూడగానే అర్థం అయింది అది "టూ టైర్" అని. "ఇది గుంటూరు కోటాదేనా" ప్రక్కతన్ని అడిగాను. 'ఔ'నన్నాడు. ఆపదలో ఆనందం అన్నట్టు సంబరపడిపోయాను. అది సరిగ్గా నే నెక్కవలసిన కంపార్టుమెంటే.

నా సీటు నెంబరు వెతుక్కుంటూ వెళ్ళి మరింత ఆనందపడ్డాను. అది కిటికీ ప్రక్కన వున్నందుకు. నా సీటులో కూర్చునివున్న లావుపాటి శాల్తీని లేపి, తాఁగా కూర్చుని సెటిలయిపోయి సిగరెట్



వెలిగించాను. అప్పుడు గుర్తొచ్చింది నేను కాఫీతాగి చాలా సేపయిందన్న విషయం. కడుపులో చిన్నగా కదలిక. తెనాలివరకూ ఓర్చుకోక తప్పదని ప్రక్క ప్యాసింజర్ల పరిశీలనలో పడ్డాను.

తెనాలిలో మెల్లగా ఆగింది రైలు. కాఫీ, టీ అమ్మేవాళ్ళు వొక్కసారిగా శత్రువు మీదికి సైనికులు పడ్డట్టు రైలు మీదికి దాడి చేశారు.

ఓ అబ్బాయిని పిలిచి "కాఫీ వేడిగా వుందా" అన్నాను. ఉందని ఓ కప్ అందించాడు. అందుకుని సిప్ చేశాను.

"ఎంత" అన్నాను.

"అరవై పైసలు సార్" అన్నాడు.

జేబు తడుముకున్నాను. చిల్లరలేదు- అయిదు రూపాయల నోటు తప్ప. "చిల్లరుందా" అడిగాను.

"తెచ్చిస్తానివ్వండిసార్" అంటూ నోటు తీసుకెళ్ళాడు.

కాఫీ తాగేశాను. వాడింకా రాలేదు. నాలో అనుమానం ప్రవేశించింది. అయిదు రూపాయలు తీసుకెళ్ళాడుగదా.వాడిక వస్తాడా అని.